క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తెనాలిఅర్బన్: ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. ఏపీజెఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం తెనాలి ఆర్టీసీ డిపో వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగులను మేనేజర్‌ను కలిసి ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండపాటి శంకరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కరిముల్లా, ఇ.విజయ్‌కుమార్, నాయకులు యలమంద, రాజేష్ ఖన్నా, డీవీ స్వామి, మనోజ్‌కుమార్, కె.బాబు, జోషిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదులో తప్పులు సరిచేయించుకోవాలి



తెనాలిటౌన్: రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటల ఈ-క్రాఫ్ నమోదులో తప్పులు ఉన్నట్లయితే రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి సరిచేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ సూచించారు. మండలంలోని సంగంజాగర్లమూడి, పెదరావూరు గ్రామాల్లోని ఆర్బీకేల్లో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. సదస్సుల్లో ఏవో మాట్లాడుతూ ఆర్బీకేల్లో ఈ-క్రాప్ నమోదు జాబితాలను ప్రకటించనున్నట్లు చెప్పారు. రైతులు తమ పేర్లను చూసుకొని శనివారం లోపు సరిచేసుకోవాలన్నారు. ప్రస్తుతం వాతావరణ శాఖ వర్షం కురిసే అవకాశముందని ప్రకటించడంతో మొక్కజొన్న, జొన్న, మినుము, పెసర, పంటల సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వర్షం కురిసినట్లయితే పొలాల్లో నీరు నిల్వ చేరకుండా చూసుకోవాలని కోరారు. ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి మండలం కఠెవరం గ్రామ రైల్వే గేటు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గేటు సమీపంలో మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా అతన్ని గుంటూరు నగర అంబేడ్కర్‌నగర్ 2వ లైనుకు చెందిన దారా సత్యనారాయణ (62)గా గుర్తించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామంలో హరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయం 12వ వార్షికోత్సవం రెండు రోజులుగా నిర్వహిస్తున్న పూజలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయాన్నే ఉత్సవమూర్తికి అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పడిపూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, పంచగవ్య పూజ, విశేష అష్టోత్తరశతనామ పూజలు నిర్వహించారు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

65 మందికి వైద్య పరీక్షలు

లచ్చన్నగుడిపూడి(తాడికొండ): తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడిలో శ్రీ వర్ధిని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అమరావతికి చెందిన శ్రీ లక్ష్మీ హాస్పటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వైద్యులు ఎస్ శ్రీధర్‌చంద్ ఆధ్వర్యంలో 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఘనంగా హరిద్రశృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసిఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లా డుతూ బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు త్వరగా పెళ్లి జరిగేందుకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకరెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

టీచర్లకు ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న డాక్టర్ ఎం.సౌజన్య

తెనాలి: ఆంధ్రప్రదేశ్ సమగ్రశిక్ష సౌజన్యంతో డైట్, బోయపాలెం వారు ఉపాధ్యాయులకు 'టీచింగ్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇంపార్టెంట్ టీచింగ్ లెర్నింగ్ కాన్సెప్ట్' కార్యక్రమాన్ని ఇక్కడి తాలూకా జూనియర్ కాలేజీలో నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ నుంచి శుక్రవారం వరకు భాషా గణితంలో పునాది అభ్యసనం, పాఠశాల, తరగతి గది వాతావరణం, ఉపాధ్యాయుని పనితీరు, నాణ్యత, పాఠశాల మదింపు అనే అంశాలపై ప్రధానంగా శిక్షణనిచ్చారు. సాయంత్రం మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ హాజరై సందేశం ఇచ్చారు. మేకల లక్ష్మీనారాయణకు గౌరవ డాక్టరేట్ వచ్చిన సందర్భంగా డైట్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ ఎం.సౌజన్య సౌజన్యంతో ఇదే వేదికపై ఆయన్ను సత్కరించారు. తాలూకా హైస్కూలు ప్రధానోపాధాయయుడు ఎస్.శ్రీనివాసరావు, స్టేట్ రిసోర్స్‌పర్సన్స్ ఎస్ఎస్ శ్రీనివాస్, పి.మురళీకృష్ణ, కె.రాంబాబు శిక్షణనిచ్చారు. అమృతలూరు, భట్టిప్రోలు, కొల్లూరు, కొల్లిపర మండలాల నుంచి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న డాక్టర్ జీవనలత

తెనాలిటౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార సరుకులు అందజేస్తున్నట్లు క్షయవ్యాధి విభాగం తెనాలి వైద్యాధికారి డాక్టర్ జీవనలత తెలిపారు. కొల్లిపర మండలంలోని మున్నంగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం క్షయ వ్యాధిగ్రస్తులకు సరుకులను డాక్టర్ జీవనలత, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీసుధ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మనోధైర్యంతో వ్యాధిగ్రస్తులు ప్రభుత్వం అందించే మందులు వాడుకుంటూ, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే క్షయవ్యాధి నివారణ సులభతరం అవుతుందని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం అవుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.రవికుమార్, ఆరోగ్యశాఖ అధికారులు స్వరూపరాణి, బాలచంద్రమౌళి, పఠాన్ అలీఖాన్, షేక్ మస్తాన్‌బీ, బి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియావారి సౌజన్యంతో 13 మందికి పోషకాహార ప్యాకెట్స్ అందజేశారు.

కొలకలూరులో..

కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు మాట్లాడుతూ మందులు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా రోజు వేసుకోవాలన్నారు. కోడి గుడ్డు, పాలు, మాంసం తినాలని సూచించారు. వ్యాధిగ్రస్థులకు పోషకాహార వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్, హెచ్ఈవో నాగరాజు, సూపర్‌వైజర్ జి.శ్రీనివాసరావు, లక్ష్మీప్రసన్న, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రహిత తెనాలి లక్ష్యం

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరంలో చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్



వైద్య శిబిరంలో ఖలేదా నసీమ్, డాక్టర్ శారద, కౌన్సిలర్లు

తెనాలి: మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బాలాజీరావుపేటలోని ఘంటా వారి సత్రంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రోత్సాహంతో మున్సిపాలిటీ సహకారంతో పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గత కొన్ని నెలలుగా ఈ వైద్య శిబిరాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో 32, 33, 34, 38 వార్డుల పరిధిలోని మహిళలకు ఏర్పాటైన వైద్యశిబిర ప్రారంభ సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వార్డు కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, వీర్లపాటి విజయలక్ష్మి మాట్లాడారు. డాక్టర్ శారద ఆధ్వర్యంలో మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందుగానే కనుగొనే పాప్‌స్మియర్ పరీక్ష, రొమ్ము పరీక్షలు చేశారు. రక్తంలో షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శారద మహిళలకు క్యాన్సర్ నిరోధానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలి లక్ష్యాన్ని చేరుకునేలా కృషి జరుగుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ చెప్పారు. ఇందుకోసం డాక్టర్ శారద, ఆమె బృందం చేస్తున్న కృషిని అభినందించారు. ఎ.రాజేశ్వరి, టి.శిరీష, పి.విజయలక్ష్మి, ఎస్.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

23న ప్రముఖులకు ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 23న ఉగాది పురస్కరించుకుని పలువురు వైద్యులు, ప్రభుత్వ అధికారులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు తెలిపారు. సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సినీ సంగీత విభావరి, అనంతరం ప్రముఖులైన అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ, లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ పి. విజయ, ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ సీహెచ్. అమూల్య, బీసీ కార్పొరేషన్ ఈడీ డి. దుర్గాబాయి, సివిల్ సప్లయిస్ జీఎం జి.లక్ష్మి, సీఐడీ ఎస్పీ కె.జి.వి. సరిత, అన్నదాన సమాజం ఈవో డి. ప్రమీలారాణి, కాకి భాగ్యలక్ష్మి, మేకల శేషకుమారికి పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

సీఆర్‌పీ టెక్నిక్‌తో ప్రాణరక్షణ

అవగాహన సదస్సులో వైద్యులు



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణసందీప్

తెనాలి: గుండెపోటు సంభవించి కార్డియాక్ అరెస్ట్ అయినపుడు తక్షణం 'కార్డియో పల్మోనరి రిససిటేషన్' (సీపీఆర్) టెక్నిక్‌తో బాధితుడి ప్రాణాలను రక్షించే విధానంపై శుక్రవారం స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కాలేజి విద్యార్థులకు డిమాన్‌స్ట్రేషన్‌తో అవగాహన కల్పించారు. వైద్యరంగంలోని యూహెచ్‌సీ రెమిడీస్ సంస్థ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి బ్రాంచి సహకారంతో శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటైన కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా రెడ్‌క్రాస్ జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ షేక్ జానీరసూల్ వ్యవహరించారు. కాలేజి ప్రిన్సిపాల్ చింతా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. డాక్టర్ కృష్ణ సందీప్, ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ పావని ప్రియాంక హాజరయ్యారు. గుండెపోటు లక్షణాలను గుర్తించిన వెంటనే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సీఆర్‌పీని అనుసరించి, ప్రాణాన్ని కాపాడవచ్చని తెలియజేశారు. యూహెచ్‌సీ ప్రతినిధి బి.ప్రశాంత్ స్వాగతం పలికారు. రెడ్‌క్రాస్, తెనాలి బ్రాంచ్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ పర్యవేక్షించారు.

19న విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

కదలిరా అంబేడ్కర్ వారసుడా పాటల సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న సురేంద్ర, ప్రభాకర్, గంగాధర్ తదితరులు

తెనాలిటౌన్(కొల్లిపర): కొల్లిపరలో ఈ నెల 19న జరగనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పాల్గొనాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు గెడ్డేటి సురేంద్ర, గెడ్డేటి ఝాన్సీవాణి పిలుపునిచ్చారు. కాంస్య విగ్రహావిష్కరణ నేపథ్యంలో అంబేడ్కర్ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన కదలిరా అంబేడ్కర్ వారసుడా పాటల సీడీని శుక్రవారం కొల్లిపరలో ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 19వ తేదీ సాయంత్రం 4 గంటలకు తెనాలి వీఎస్ఆర్ కళాశాల నుంచి కొల్లిపర వరకు భారీ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాంస్య విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథిగా తమిళనాడుకు చెందిన వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ తిరుమావళవన్, బహుజన ప్రముఖులు హాజరవుతారని వివరించారు. రాజకీయాలకు అతీతంగా జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొని బహుజనుల సత్తాను చాటాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, పిల్లి గంగాధర్, ఆరే శేఖర్, మంద్రు రాజు, కంచర్ల అమృతరాజు, కంచర్ల విజయభాస్కర్, బేతాళ భూషణం, నక్కా సంసోను, ఉన్నవ నాని, కనపర్తి అనిల్, సొపాటి కిరణ్, అక్కిదాసు కిరణ్‌కుమార్, అంబేడ్కర్ యువజన సమాఖ్య సభ్యులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

సాంఘిక నాటక కళాకారుడు, రచయిత వర్మకు సన్మానం



వర్మను సన్మానిస్తున్న ఆరిఫ్, కిషోర్ తదితరులు

తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం ధనమా దైవమా చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం సాంఘిక నాటక కళాకారుడు, రచయిత కొండమూడి వర్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అబ్దుల్ ఆరిఫ్, అప్పల కిషోర్, ఆర్‌వీఎస్ ప్రదీప్‌కుమార్, టి.కొండయ్య, మట్లపూడి సైమన్, పి.రాజగోపాల్, నాయక్, టి.ఇశ్రాయేల్ పాల్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, కొండమూడి రమేష్, తెనాలి రవికుమార్, వేజండ్ల కనకాంబరం, వేజండ్ల జ్ఞానరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగ మహోత్సవం

తెనాలి: ఆధ్యాత్మిక శిక్షణలో ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తున్న శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, తెనాలి కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో 'ఉచిత యోగ మహోత్సవం' నిర్వహించనున్నట్లు సెంటర్ కో-ఆర్డినేటర్ ఎ.శ్రీకృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రతి హృదయం ధ్యానం, ప్రతి ఇంటా ధ్యానం నినాదంతో చేపడుతున్న ఉత్సవంలో ఆసనాలు, ప్రాణాయామం, ముద్ర, ప్రాణాహుతి ప్రసాదంతో కూడిన ధ్యానంలో శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. తాలూకా జూనియర్ కాలేజి మైదానంలో ప్రతి రోజూ ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు ఈ శిక్షణ తరగతులు ఉంటాయని వివరించారు.

కేఎల్‌యూకు ఎక్స్‌లెన్స్ అవార్డు



కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కేఎల్‌యూ డీన్ డాక్టర్ వి.రాజేష్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ మాట్లాడుతూ యునెస్కో, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, పర్యావరణ మంత్రిత్వ శాఖల సమన్వయం, అడ్వాన్స్‌డ్ వాటర్ డ్రైనేజీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ నీటివినియోగం, నిర్వహణలో కేఎల్ విశ్వవిద్యాలయానికి ఎక్స్‌లెన్స్ అవార్డు లభించిందని తెలిపారు. ఈ అవార్డును విశ్వవిద్యాలయ ప్లానింగ్, అభివృద్ధి డీన్ డాక్టర్ వి.రాజేష్ న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతుల మీదుగా అందుకున్నారని తెలిపారు. కేఎల్‌యూకి ఇటువంటి గౌరవం లభించడం ఇది రెండవసారి అని అన్నారు. ప్లానింగ్, అభివృద్ధి డీన్ డాక్టర్ వి.రాజేష్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో వాడిన నీరు వృథాగా బయటకు పోకుండా శుద్ధి చేసి ఆ నీటిని మొక్కలకు వాడడం ద్వారా భూగర్భ జలాలకు అందజేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు శుక్రవారం వృద్ధులకు అన్నదానం చేశారు. యోగా సభ్యులు సుగ్గున అశోక్‌కుమార్, హారిక దంపతుల కుమారుడు రోహన్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలను ఆశ్రమంలో జరిపారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. తొలుత ఆశ్రమంలో ఉన్న గాంధీజీ, కస్తూర్బాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, పద్మావతి, సావిత్రి, భరత్‌స్వామి, పి.కుటుంబరావు, యోగసాధకులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అప్పారావు

తాడేపల్లిరూరల్: ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక, ఉద్యోగ, రైతాంగ, వ్యవసాయ కార్మిక ప్రదర్శనను జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. దుగ్గిరాలలోని పీహెచ్‌సీ సెంటర్‌లో ఆశా వర్కర్లను కలసి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ పాలనలో గ్యాస్, పెట్రోల్, డీజిల్, మందుల ధరలు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు. సంఘం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలపై ఈనెల 21వ తేదీన గుంటూరులో డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ దుగ్గిరాల మండల అధ్యక్షకార్యదర్శులు సీహెచ్ వెంకటేశ్వరమ్మ, తెనాలి సునీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్: ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న కార్మిక, కర్షక ర్యాలీ కరపత్రాలను శుక్రవారం సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి యర్రబాలెంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యిందని విమర్శించారు.


చిలువూరులో ప్రచారం

ఏప్రిల్ 5న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ప్రజాసంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు వి.సాంబశివరావు, కె. సుబ్బారావు, వై.బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ, సాగునీటి రంగాలకు బడ్జెట్‌లో 20 శాతం కేటాయించాలి

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ, సాగునీటి రంగాలకు బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరరెడ్డి అన్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వద్ద జాతీయ రహదారిపై రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి, రైతులకు రాష్ట్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. నీటి పారుదల, వ్యవసాయ రంగాలకు 13 శాతం మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారని విమర్శించారు. ఏపీ రైతు సంఘం అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ, ఏపీ కౌలు రైతు సంఘం అధ్యక్షకార్యదర్శులు వై. రాధాకృష్ణ, ఎం.హరిబాబు, ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు కాజా వెంకటేశ్వరరావు, మొసలి జ్యోతిబసు, రాజబాబు, పంచకర్ల రంగారావు, ఎం. రామాంజనేయులు, సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు పార్వతి, అప్పలస్వామి పాల్గొన్నారు.

రహదారి భద్రతా అవగాహన ర్యాలీ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయ విద్యార్థులు శుక్రవారం నూతక్కి గ్రామంలో రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థి విభాగ అధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ ట్రాఫిక్, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, రోడ్లపై వాహనాలు నడుపుతున్నప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని, అతివేగం ప్రమాదకరమని వివరించారు. సాక్ డైరెక్టర్ హాయ్ విజయ్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రుతురమ్య, డాక్టర్ గోపీకృష్ణ, శుభకర్ రాజు, సీఈఏ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెనాలిలో తేలికపాటి వర్షం

ఈదురుగాలులకు పడిపోయిన పందిళ్లు



రాములవారి గుడివద్ద నేలకొరిగిన పందిరి

తెనాలిఅర్బన్: తెనాలిలో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. వర్షానికి తోడు ఈదురుగాలులు వీయడంతో పట్టణంలో అక్కడక్కడా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శ్రీరామనవమి పందిళ్లు నేలకొరిగాయి. ఉదయం నుంచి చలిగా ఉండటం, సాయంత్రం వేళ చిరుజల్లులు కురిశాయి. ఈదురుగాలులు కూడా వీస్తున్నాయి. ఇప్పటి వరకు ఎండవేడిమితో అల్లాడిన ప్రజలకు కొంత సేదా తీరినట్లు అయింది. తెనాలిలో ఇప్పటివరకు 12.08 మిల్లీమీటర్ల వర్షం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.